క్లుప్తంగా

కోయిల్‌సాగర్ నీటిని వదలాలి

మరికల్: జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు పంపింగ్ చేసిన నీటిని పంటలకు వదిలేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరన్న, నాయకులు గోటూర్ జనార్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద సాగుచేస్తున్న వరినాట్లకోసం ప్రాజెక్ట్ నీటిని వదిలితే ఏక కాలంలో నాట్లు వేసుకోవచ్చన్నారు. అలాగే కేఎస్పీ నీటిని విడుదలచేసి చెరువులను నింపాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రామకృష్ణ, మొగులప్ప, హరిష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

టౌన్ ఎస్ఐగా విజయ్‌కుమార్



నారాయణపేట రూరల్: పట్టణ ఎస్ఐగా జీ.వి జయ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి బదిలీపై నారాయణపేటకు వచ్చిన ఇతనికి టౌన్ పీఎస్‌కు కేటాయించారు. ఈ మేరకు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందించారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో తనవంతు కృషి చేస్తానన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా కలవాలని, తప్పకుండా న్యాయం జరిగేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. కాగా ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సురేష్ గౌడ్‌ను పేట ఎస్‌బీ ఎస్ఐగా నియమించారు.

లయన్స్‌క్లబ్ గవర్నర్‌కు సన్మానం



నారాయణపేట రూరల్ : లయన్స్‌క్లబ్ గవర్నర్‌గా హరినారాయణ్‌బట్టడ్ అమెరికాలో ప్రమాణస్వీకారం చేసి స్వదేశానికి వచ్చిన సందర్భంగా శనివారం పేటలో ఘనస్వాగతం పలికారు. పట్టణ ప్రముఖులు కలుసుకుని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవ చేయడానికి సైతం ముందుకు రావాలని, పేదలకు అవసరమైన సహాయాన్ని చేస్తే అందులో కలిగే ఆనందం ఎక్కువ ఉంటుందన్నారు. ఇప్పటి వరకు చేసిన సేవలకంటే ఎక్కువగా తన సభ్యులు, క్లబ్‌ల ఆధ్వర్యంలో చేస్తాని ప్రకటించారు. కార్యక్రమంలో లయన్ సభ్యులు మొల్గాన్ జనార్ధన్, ఆత్మారాం, నాగరాజు, కన్నజగదీష్, కృష్ణమూర్తి, భీంచర్‌గౌడ్, శ్రీనివాస్‌లాహోటీ, సత్యనారాయణ, జయంత్‌రెడ్డి, అమరేష్, బాలాజీ, శ్రీసాయి కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, పీఆర్‌టీయూ జిల్లా సెక్రటరీ జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకోసం ఫాగింగ్



ధన్వాద: మండల కేంద్రంలోని పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణకోసం ఫాగింగ్ చేపట్టారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో దోమల నివారణ మందును ఫాగింగ్ చేసినట్లు గ్రామ సర్పంచ్ అమరేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామస్తులు ఇంటి పరిసరాలలో దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ధూప దీప నైవేద్య సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



జంగం జ్ఞానేశ్వర్

దామరగిద్ద: ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడిగా జంగం జ్ఞానేశ్వర్ ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరన్నస్వామి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్చకుల సమస్యల పరిష్కారానికి తనవంతు బాధ్యతగా కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవికుమార్, మహేష్, మండల అర్చక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముసురు వర్షానికి కూలిన ఇళ్లు



అమరచింతలో కూలిపోయిన మట్టి ఇంటిని పరిశీలిస్తున్న సిబ్బంది



మాగనూర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



మాగనూర్‌లో వర్షానికి కూలిన ఇళ్లు

మాగనూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండల పరిధిలోని కోల్పూర్‌లో ఇళ్లు కూలిపోయింది. ఈ ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. కూలిన ఇంటిమట్టి మురుగుకాల్వపై పడటంతో మురుగునీరు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

అమరచింత: కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరిన ఇళ్లతో పాటు మట్టి మిద్దెలు కూలిపోయే ప్రమాదం ఉందని, అలాంటి గృహాల్లో ఎవ్వరూ నివసించొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజా కోరారు. శనివారం మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పది వార్డుల్లో శిథిల ఇళ్ల వివరాలపై సర్వే చేయించారు. శనివారం జగన్‌వాడకు చెందిన కాడ్గి లచ్చి కి చెందిన మట్టి మిద్దె కూలిపోవడంతో బాధిత కుటుంబ పరిస్థితిని పరిశీలించారు. ఈమేరకు ప్రత్యామ్నాయంగా వేరే ఇళ్లు చూసుకోవాలని సూచించారు. రాత్రివేళల్లో వర్షాల తాకిడికి మట్టి మిద్దెలు తడిసి కూలిపోతున్నాయని, దీంతో ప్రాణ నష్ట జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి, సురక్షితమైన ఇళ్లల్లో నివసించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది బాలగోపాల్, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సాధనకు ఉద్యమబాట



కరపత్రాలు విడుదల చేస్తున్న తపస్‌నాయకులు

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయ సమస్యల సాధనకు ఉద్యమబాట పట్టక తప్పడంలేదని తపస్‌రాష్ట్ర నాయకులు గుంపు బాలరాజు అన్నారు. శనివారం స్థానిక డీఈఓ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదలచేసి మాట్లాడారు.. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. కమిటీల పేరుతో పీఆర్‌సీ విషయంలో కాలయాపన చేస్తుందన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. ఇప్పటికే టీచర్లనుంచి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తయిందని, ఈ నెల 25న తహసీల్దార్, 31న ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రాలు అందిస్తామన్నారు. ఆగస్టు 5న జిల్లాకేంద్రంలో ధర్నా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌ప్రభు, తిరుపతయ్య, కనకప్ప, రాములు, శ్రీకాంత్, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాస్, రవికుమార్, రాజశేఖర్, సంగీత, లక్ష్మణ్, వెంకట్రాములు, రాఘవ, తిరుపతి, తార్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వర్షం కవర్ల పంపిణీ



మరికల్: మండల కేంద్రంలోని లయన్స్‌క్లబ్ చైర్మన్ హరినారాయణ బట్టట్ శనివారం పంచాయతీ కార్మికులకు వర్షం కవర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలంలో కార్మికులు తడిసిపోకుండా ఉండేందుకు లయన్స్ క్లబ్ తరపున వీటిని అందజేసినట్లు తెలిపారు. వీటిని జిల్లాలో మొత్తం పంచాయతీ కార్మికులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్, కార్యదర్శి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

‘డబుల్ ఇళ్ల నిర్మాణాలపై సోయిలేదు’



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

మరికల్: జిల్లాలో సొంతఇళ్లు లేక ప్రజలు అనేక అవస్థలు పడుతుంటే ఇక్కడి అసమర్థత ఎమ్మెల్యేలకు డబుల్‌బెడ్రూం నిర్మాణాలపై సోయిలేకుండా పాయిందని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్దచింతకుంటలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. సీఎం కేసీఆర్ అక్కడక్కడ కొన్ని డబుల్‌బెడ్రూం ఇళ్లను నిర్మిస్తున్నారని, వెనకబడిన జిల్లాలో ఇంతవరకు ఒక్కఇళ్లు నిర్మించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సొంత ఇళ్లు లేక ఇంటికి సరిపడే డబ్బులను జమచేసుకోవడంకోసం గిరిజనులు పట్టణాలకు వలసవెళ్లి డబ్బులు పొగుచేసుకొని ఇళ్లు నిర్మించుకుంటున్నారని గుర్తుచేశారు. జిల్లాలో 2090 ఇళ్లు మంజూరైతే ఎక్కడ నిర్మాణాలు చేపట్టాలేదన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నారాయణపేట రూరల్: రాబోయే శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పట్టణం, మండలంలో ఏర్పాటుచేయనున్న పోలింగ్ కేంద్రాలను శనివారం పోలీసు అధికారులు పరిశీలించారు. సీఐ రవిబాబు, రూరల్ ఎస్ఐ జయప్రసాద్, ఎస్ఐ-2 సంతోష్ క్షేత్రస్థాయిలో కలిగే ఇబ్బందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరాలు సేకరించారు. మౌలికసదుపాయాలు, తాగునీరు. టాయిలెట్స్ తదితర వాటిపై విచారణ చేశారు. కాంపౌండ్‌వాల్ తప్పకుండా ఉండేవిధంగా చూస్తున్నారు.

కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న భీమయ్యగౌడ్

దామరగిద్ద: రైతు వ్యతిరేక విధానాలతో పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ఎంపీపీ నర్సప్ప, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు భీమయ్యగౌడ్, విండో అధ్యక్షుడు ఈదప్ప, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కాన్‌కుర్తి రైతువేదికలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. కాంగ్రెస్ నాయకులు చెప్పిన మూడుగంటల విద్యుత్ కావాలో రైతులే తేల్చుకోవాలన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, శరణప్ప, ఎంపీటీసీ, భీంరెడ్డి, జ్ఞానేశ్వర్, కన్కిరెడ్డి, శ్రీనివాస్‌షెట్టి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి



ధన్వాద: మండలంలోని కొడంగల్‌ఎత్తిపోతల పథకం చేపట్టాలని జలసాధన సమితి కో -కన్వీనర్ హెచ్.నర్సింహ ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు సాగునీరందించే జీవో 69 అమలుచేసి పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే వచ్చేఅసెంబ్లీ ఎన్నికలలోపు రైతులకు మూడుపంటలకు సాగునీరందించే విధంగా కేసీఆర్‌ను ఒప్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ రాంచంద్రయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్, జలసాధన సమితి నాయకులు కృష్ణయ్య, కుర్మప్ప, వడెప్ప, నర్సింహులు, సుదర్శన్‌గౌడ్, విష్ణువర్ధన్‌గౌడ్, కృష్ణయ్య, కురుమూర్తి, బాల్‌రాం, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ట్రాన్స్‌పోర్ట్ డబ్బులు చెల్లించాలి



పీఏసీఎస్ ఎదుట ధర్నాచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్వ: పీఏసీఎస్ పరిధిలో గతమూడు సీజన్ల రైతుల ట్రాన్స్‌పోర్ట్ డబ్బులను వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ డిమాండ్ చేశారు. శనివారం పీఏసీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. గత మూడు సీజన్ల ట్రాన్స్‌పోర్టు చార్జీలు రూ. 45లక్షలను రైతుల అకౌంట్‌లలోకి వేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. పీఏసీఎస్‌లో జరుగుతున్న అవకతవకలపై వెంటనే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి రైతులకు సంబంధించిన ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులను స్థానిక ఎస్ఐ సీహెచ్. కురుమయ్య తన సిబ్బందితో వచ్చిస్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ నీరజ్, శరణప్ప, వివేకవర్ధన్‌రెడ్డి, అయ్యపురెడ్డి, సంజీవారెడ్డి, మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది కపట ప్రేమ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నర్వ: మండల రైతులకు పీఏసీఎస్ ద్వారా గత మూడు సీజన్లనుంచి రవాణ చార్జీలు రాకుంటే ఇప్పుడు గుర్తుకొచ్చిందా కాంగ్రెస్‌నాయకులకు అని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రైతులపై కాస్తప్రేమ ఉంటే గతచైర్మన్ నుంచి ట్రాన్స్‌పోర్టు డబ్బులు వసూలుచేసి రైతులకు అందించాలని హితవు పలికారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. సమావేశంలో విండో వైస్‌చైర్మన్ లక్ష్మన్న, పల్లెశేఖర్, వెంకటయ్య, మహేశ్వర్‌రెడ్డి, గడ్డం నర్సింహులు, అయ్యప్ప, శ్రీకాంత్‌రెడ్డి న్నారు.

అధ్వానంగా బైరంపల్లి రోడ్డు



ప్రమాదకరంగా మారిన బైరంపల్లి రోడ్డు

మాగనూర్: బైరంపల్లిరోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నెరడగం గేట్ నుంచి 4కి.మీ రోడ్డుమొత్తం మట్టిరోడ్డు ఉండంతో గుంతలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బైరంపల్లి రోడ్డులో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు, ప్రయాణికులు నానాఅవస్థలు పడుతున్నారు. గ్రామానికి బీటీరోడ్డుకు నోచుకోకపోవడంతో ఏ ఆపద వచ్చినా గుంతల రోడ్డుపైనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్డును బాగుచేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె



నారాయణపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న కార్మికులు



మక్తల్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

నారాయణపేట రూరల్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపడుతున్న కార్మికుల సమ్మె శనివారంతో 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బలరాం మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. జీఓ 60 ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, జీపీ ట్రాక్టర్లకు డ్రైవర్లను నియమించాలన్నారు. కార్మికుల ప్రాణత్యాగంతో సాధించుకున్న 29రకాల చట్టాలను తుంగలోతొక్కి కట్టుబానిసలా పనులు చేయిస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామచందర్, హన్మంతు, రవి, వెంకటేష్, రాజు, రాయప్ప, చంద్రమౌళి, భీమప్ప, భగవంతు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపడుతున్న సమ్మె శనివారంతో 17రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ. 19 వేలు ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిరణ్, వెంకటేష్, భగవంతు, రాంచంద్రి, నర్సింహ, నారాయణ, శ్రీనివాసులు, నర్సింహ, కిష్టప్ప, నరేష్, సాయన్న, రాజు, ఆంజనేయులు, రాములు, బాల్‌రాజు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు సత్యనారాయణ మాట్లాడుతూ.. గతకొన్ని రోజులుగా సమ్మె చేపడుతున్న ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పంచాయతీ కార్మికులు పోలప్ప, మార్కండీ, పరుశరాం, ఉదయ్‌కుమార్, శుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: కార్మికులు సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో శనివారం సీఐటీయూ, పీవైఎల్, డీవైఎఫ్ఐ, ప్రజాపంథా నాయకులు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఇన్నిరోజులు సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. పంచాయతీల అభివృద్ధిలో కీలక భూమిక పోషించే వీరిని ప్రభుత్వం విస్మరించడం సిగ్గుచేటన్నారు. ప్రజాసంఘాల నాయకులు కొండ నర్సింహులు, శ్రీను, అంజి, రాములు, భరత్, కేశవులు, భీములు, అంజి తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ అన్నారు. కార్మికులు గత 17రోజులుగా రిలేదీక్ష చేపట్టిన ప్రభుత్వం స్పందించక పోవడం సోచనీయమన్నారు. కనీస వేతనం రూ. 19 వేలు ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రప్ప, శివానంద్, వెంకటప్ప, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కోటకొండను మండలం చేయాలి



దీక్షలో సాధనసమితి సభ్యులు

నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండలో శనివారం 74వ రోజు నిరసన దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అన్ని అర్హతలు కల్గిన కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు అడ్డుతొలిగి, ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలను పరిశీలించే విధంగా ఒత్తిడి తెవాలన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని నియోజకవర్గంలో మూడు ప్రాంతాలను మండలాలుగా ప్రకటింపచేయాలన్నారు. కార్యక్రమంలో రాజు, చెన్నప్ప, ప్రవీణ్, బాలప్ప, దస్తప్ప, సత్యప్ప, రాములు, వెంకట్రాములు, నారాయణ, నవీన్, రాజవర్ధన్, ఆశప్ప, లక్ష్మప్ప, మాసన్న, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

మక్తల్: మిషన్‌భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టులేబర్ జీఓ ప్రకారం కార్మికులకు కనీస వేతనాలు, పండుగ సెలవులు ఆర్జిత సెలవులు బోనాస్, పీఎఫ్, ఈఎస్ఐ లాంటి అన్నిహక్కుల ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు ఏవీ అమలు చేయడంలేదన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో జేఏసీ రాష్ట్ర నాయకులు భుట్టో, రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, విస్‌బోస్, మహేష్ పాల్గొన్నారు.

సాయిచంద్ విగ్రహం ఏర్పాటు చేయండి

అమరచింత: ప్రముఖ గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ చైర్మన్ దివంగత సాయిచంద్ విగ్రహన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని అమరచింతలో బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం దీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా ప్రధానకార్యదర్శి విజయ్, దుప్పల్లి కురుమూర్తి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో సాయిచంద్ తన ఆటపాటలతో జనంలో ఉత్తేజం నింపుతూ ప్రజా ఉద్యమానికి నాంది పలికాడని కొనియాడారు. ధూంధాంలు నిర్వహించి చైతన్య పరిచాడని, బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలతో పాటు ఎన్నికల సమయంలో నిర్వహించిన సభలో పాల్గొని తన గాత్రం ద్వారా జనం ఆదరణతో పాటు అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన సాయిచంద్‌కు సీఎం కేసీఆర్ తగున్యాయం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నారాయణపేట:పేటలోని శీలాగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక ఎంబీఉన్నత పాఠశాలలో 2008 వరకు విద్యను అభ్యసించిన విద్యార్థులు ఒకరికొకరు కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం విద్యాబోధించిన అధ్యాపక బృందానికి పూర్వ విద్యార్థులు జ్ఞాపిక అందజేసి పూలమాల, శాలువాతో సన్మానం చేశారు. అంతకుముందు విద్యబోధించి మృతిచెందిన ఉపాధ్యాయుల చిత్రపటాలకు పూలమాలవేసి స్మరిస్తూ రెండునిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు జాన్సన్, బాబు, ప్రేమానంద్, నరహరి, సోలోమోన్‌రాజ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల బృందం

మణిపూర్ ఘటనపై కేంద్రం బాధ్యత వహించాలి



దామరగిద్ద: మణిపూర్‌లో జరిగిన అమానుష ఘటనపై కేంద్రం బాధ్యత వహించాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథ నాయకుడు ఉదయ్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేద్కర్‌చౌరస్తాలో ప్రధానిమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు బీజేపీ ప్రభుత్వంలో రక్షణలేకుండా పోయిందన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన కీచకులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధు, చాంద్‌పాషా, వెంకటప్ప, హనుమాన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన అమానవీయ ఘటనకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో నిందితుడి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పీడీఎస్‌యూ, సీఐటీయూ నాయకులు శ్రీహరి, శ్రీను మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం జాతుల మధ్య గొడవను అణిచివేడయంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అంజి, రమేష్, అశోక్, భరత్, లాలు, చిన్న, రోషన్ ఉన్నారు.